ప్రజాశక్తి

ఆదివారం 17 ఆగస్టు 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా







గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని, కొనకళ్ల తదితరులు

గౌతు లచ్చన్న జీవితం ఆదర్శం

- బిసి సంక్షేమ మంత్రి సవిత
- ఆదరణ 3.0 పథకం ద్వారా మోపెడ్లు
- గీత కార్మికులకు ఉపాధి పెంచేలా నూతన ఉత్పత్తుల రూపకల్పన
- రంపచోడవరం హార్టీకల్చర్ పరిశోధనా కేంద్రంలో తాటి ఉత్పత్తుల తయారీ

ప్రజాశక్తి - విజయవాడ : బడుగు బలహీన వర్గాల కోసం డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జీవితాంతం పాడుపడ్డారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ గౌతు లచ్చన్న 116వ రాష్ట్ర స్థాయి జయంతోత్సవ కార్యక్రమాన్ని విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా సర్దార్ గౌతు లచ్చన్న (మిగతా 2లో)

బ్లాక్‌లో యూరియా

కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు

యూరియా కొరత రైతులను వేధిస్తోంది. అరకొరగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూరియా కూడా పక్కదాడి పట్టడంతో సామాన్య రైతులకు కష్టాలు తప్పడంలేదు. కృష్ణాజిల్లాలో యూరియా కృత్రిక కొరత అధికమైంది. ఈ కారణంగా జిల్లాలో సాగవుతున్న 1.67 లక్షల హెక్టార్ల ఖరీఫ్ వరి సాగులో ప్రధానంగా వాడాల్సిన యూరియా కొరత రైతులకు తలనొప్పిగా మారింది. జిల్లాకు 36 వేల టన్నుల యూరియాను జిల్లా వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టింది. ఇప్పటికి కేవలం సొసైటీలు, వ్యాపారస్తుల ద్వారా సుమారు 24 వేల టన్నులే మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాకు సరఫరా అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

నల్ల బజార్లకే యూరియా పరిమితం...

నల్లబజార్లకే పరిమితమైన యూరియాను అధిక ధరలకు రైతులకు దళారులు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఈసమస్యపై ఎన్నోసార్లు అధికారులకు రైతులు తమగోడును విన్నవించుకున్నా పట్టించుకునే నాధుడే కరువవటంతో దళారులే రాజ్యమేలుతున్నారు. రైతన్నకు ఒక్కో కట్ట రూ.350 నుంచి రూ.500 వరకు నల్లబజార్లలో అమ్ముతున్నారు. ఇటీవల గుడ్లవల్లేరులోనే లారీ యూరియా కట్టలను అరగంటలోనే ఒక వ్యాపారి అమ్మేశాడంటే... రైతులను ఎలా దోచుకుంటున్నారో అవగతమవుతుంది. దీంతో ఒక్కో యూరియా కట్టకు రూ.235 రైతన్నకు వాత పడుతోంది. అసలు ఎంఆర్పీ ధర 265.50 రూపాయలే ఉంది.



గుడ్లవల్లేరు పిఎసిఎస్ వద్ద క్యూలో నిలబడిన రైతులు

వర్షం లేదన్న సాకుతో...

వరిచేలు ఎర్రబడ్డాయని చెప్పి యూరియాకు కొందరు వ్యాపారులు కత్రిమ కొరత సృష్టించారు. ఈ కారణంగానే రైతులు ఒకర్ని బట్టి వేరొకరు యూరియాను అధికంగా బస్తాల కొద్దీ దిమ్మరిస్తున్నారన్న వాదనలను ముందుకు చేస్తున్నారు. ఇదిలా ఉంటే తమకు వ్యవసాయం తెలియదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. అదునుకు సరిపడా యూరియాను పంటకు అందిస్తున్నామని అంటున్నారు. కేవలం నల్లబజార్లలో అమ్ముకునేందుకే వ్యాపారులు, అధికారులు కుమ్మక్కయ్యి సాకులు చెబుతున్నారని అంటున్నారు. జిల్లాకు రావాల్సిన యూరియా (మిగతా 2లో)

పెద్ద రైతులకేనా?



ఈడె శ్రీను, రైతు, కౌతవరం రైతు, గుడ్లవల్లేరు మండలం

పెద్ద రైతులకే యూరియాను అందిస్తున్నారు. సొసైటీల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో నిలబడిన మాకేమో అరకట్ట యూరియా ఇస్తామని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యాపారుల వద్ద ఎంఆర్పీ ధరకు యూరియాను అందించే విధంగా చర్యలు తీసుకుంటే యూరియా కృత్రిమ కొరతను కొంత వరకు తగ్గించవచ్చు.

యూరియా పక్కదారి



మద్దాల నాగరాజు, రైతు, కౌతవరం, గుడ్లవల్లేరు మండలం

ప్రభుత్వం పిఎసిఎస్‌లకు పంపుతున్న యూరియా పక్కదారి పడుతోంది. యూరియాను వాడకపోతే పంటలు ఎదగవు. కానా సామాన్య రైతుల చేతికి యూరియా అందకుండా చేస్తున్నారు. ఎవరికి చెప్పినా ఉపయోగం లేకుండా పోతోంది. వ్యాపారులేమో సగానికి సగంపైగా కట్ట ధరను పెంచేస్తున్నారు.

మీడియాతో మాట్లాడుతున్న సిపి



వార్త మెయిన్‌లో

యుపిక్స్ కేసులో ముగ్గురు అరెస్టు

ఆభరణాలు స్వాధీనం

రూ.23 కోట్ల ఆస్తులు అటాచ్

కృష్ణమ్మ వరద తగ్గుముఖం

ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 2,40,159 క్యూసెక్కులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులతోపాటు తెలంగాణ, ఎన్టీఆర్ జిల్లాలోని వాగులు, వంకల నుండి వరద ప్రవాహం తగ్గడంతో నిన్నటిదాకా బ్యారేజికి పోటెత్తిన వరద క్రమంగా తగ్గుముఖం పట్టింది. శనివారం ఉదయం బ్యారేజ్‌కి 2,59,147 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగగా, రాత్రికి 2,56,125 క్యూసెక్కులకు తగ్గంది. బ్యారేజికి చెందిన 5 గేట్లను ఏడు అడుగులలు, 65 గేట్లను ఆరు అడుగుల మేర ఎత్తి వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 2,506 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ కాల్వకు 516 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాల్వల ద్వారా మొత్తం 3,022 క్యూసెక్కుల నీరు సాగు, తాగు అవసరాల నిమిత్తం విడుదల చేసినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు వెల్లడించారు. కృష్ణా నది వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో నదీ పరివాహక లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ శాఖ అధికారులు హెచ్చరిక జారీ చేశారు.

రాజధానికి తొలగని ముంపు

- కొండవీటివాగు నివారణ ప్రణాళికలోనే లోపం
- ప్రయోజనంలేని ఉండవల్లి ఎత్తిపోతల
- రూ.225 కోట్లు వృథా - మళ్లీ కొత్త ప్రణాళికలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని ప్రాంతాన్ని ప్రతి ఏటా పలు వాగులు ముంపునకు గురి చేస్తున్నాయి. రాజధాని అమరావతికి ముంపు సమస్యను శాశ్వత పరిష్కారం కనుగొనేలా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. రోగం ఒకటి అయితే మందు మరొకటి వేసినట్టుగా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టు సంస్థలు వ్యవహరిస్తున్నాయని గత పదేళ్లలో రాజధానిలో ముంపు నివారణ పనులను పరిశీలిస్తే స్పష్టం అవుతోంది. రూ.వందల కోట్లు ఖర్చు చేసినా ఫలితం మాత్రం ఆశించిన స్థాయిలో రావడం లేదు.



నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వద్ద కొండవీటి వాగు (ఫైల్)

రాజధాని గ్రామాల్లో ముంపు సమస్యను ఇటీవల ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం కూడా అధ్యయనం చేసి పలు సూచనలు చేసింది. అయినా ఇంతవరకు అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. రాజధాని ప్రాంతం ముంపులో తీవ్ర ఇబ్బందిగా మారిన కొండవీటి (మిగతా 2లో)

ఆలోచనలు రేకెత్తించిన ఛాయాచిత్రాలు

కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ
ప్రతి చిత్రం ఓ కళాత్మక సందేశం

ప్రజాశక్తి - విజయవాడ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (ఆగస్టు 19) సందర్భంగా నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు పంపిన ఛాయాచిత్రాలు ప్రతిఒక్కరిలో ఆలోచనలు రేకెత్తించేలా ఉన్నాయని, ప్రతి ఛాయాచిత్రం కళాత్మక సందేశాన్ని అందిస్తున్నాయని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన విజేతల వివరాలను శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో విడుదల చేశారు. పోటీల్లో మొత్తం 186 ఫొటో ఎంట్రీలు రాగా, వీటిని ఆరుగురు సభ్యులతో కూడిన న్యాయనిర్ణేతల బందం పరిశీలించి విజేతలను ఎంపిక చేసిందన్నారు. మొదటి విభాగమైన పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర, యోగాంధ్ర అంశంలో జీఎన్ రావు (ది హిందూ), సీహెచ్‌వీ మస్తాన్ (ది హాన్స్ ఇండియా), కేవీఎస్ గిరి (ది హిందూ) ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు సాధించగా.. సి.మల్లికార్జున్ (ఈనాడు), పి.రాజేష్ (ఆంధ్రజ్యోతి), ఎం.ప్రశాంత్ (ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్), సీహెచ్ నారాయణరావు (దక్కన్ క్రానికల్), పి.ప్రసాద్ (ఎస్‌డీఎంఎస్‌డీ), ఎస్ఎస్ విజయబాబు (టైమ్స్ ఆఫ్ ఇండియా) ప్రోత్సాహక బహుమతులు సాధించారని వివరించారు. రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లకు చెందిన ఫొటోల్లో ఎ.రాజేంద్రప్రసాద్ (ఐ అండ్ పీఆర్), జీఎన్ రావు (ది హిందూ), ఆర్‌వీ అప్పారావు (ఫ్రీలాన్సర్)లు ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు సాధించగా.. కేవీఎస్ గిరి (ది హిందూ), ఎ.రామచంద్రరావు (ప్రజాశక్తి), బి.మరిడయ్య (ఈనాడు), వైవీవీ సత్యనారాయణ (ఈనాడు), సంపత్ కుమార్ (ఈనాడు), ఎంపీఎస్‌కే దుర్గాప్రసాద్ (ఈనాడు) ప్రోత్సాహక బహుమతులు సాధించారన్నారు. మూడో విభాగంలో బెస్ట్ న్యూస్ పిక్చర్‌లో సీహెచ్ నారాయణరావు (దక్కన్ క్రానికల్), జి.మహేశ్ (టైమ్స్ ఆఫ్ ఇండియా), ఎం.ప్రశాంత్ (ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్)లు ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు జీవీ నారాయణ (ఆంధ్రజ్యోతి), ఎస్.కిశోర్ (సాక్షి), బి.మరిడయ్య (ఈనాడు), కె.చక్రపాణి (సాక్షి), డి.లక్ష్మణ్ (ఆంధ్రజ్యోతి), బి.సతీష్‌కుమార్ (ఆంధ్రజ్యోతి)లు ప్రోత్సాహక బహుమతులు సాధించినట్లు కలెక్టర్ లక్ష్మీశ ప్రకటించారు. విజేతలకు ఈనెల 19న నిర్వహించే అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం కార్యక్రమంలో నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. న్యాయ నిర్ణేతలు కె.రవి, సీహెచ్ విజయభాస్కర్, జి.అనిత, టి.శ్రీనివాస్‌రెడ్డి, డి.సీతారాం, కె.రవికుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, ఏవీఎస్ వీవీ ప్రసాద్, సీనియర్ ఫొటోజర్నలిస్టు సీహెచ్ విజయభాస్కర్, వివిధ ప్రింట్ మీడియా ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఐకానిక్ టవర్ల నుండి నీటి తోడివేత ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అమరావతిలో ఐకానిక్ టవర్ల పునాదుల్లో చేరిన నీటిని తొడివేసే ప్రక్రియ కొనసాగుతోంది. రెండురోజులుగా నాలుగు ఇంజన్లతో నీటిని తోడివేస్తున్నారు. రాజధాని అమరావతిలో ఇంటిగ్రేటెడ్ సెక్రటేరియట్, హెచ్ఓడి కార్యాలయాల నిర్మాణ టెండర్లను ఎన్‌సిసి సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ సచివాలయంలోని జిఎడి టవర్‌ను నిర్మించనుంది. ఇంటిగ్రేటెడ్ సచివాలయంలోని 1, 2 హెచ్ఓడి టవర్ల నిర్మాణ పనులను షాపూర్ జీ పల్లోంజి సంస్థకు కేటాయించారు. రూ 1487.11 కోట్లతో ఈ టవర్ల నిర్మాణ పనులు చేపట్టనుంది. భారీ వర్షాలకు 1, 2 హెచ్ఓడి టవర్ల నిర్మాణ పునాదులలోకే నీరు పెద్దఎత్తున చేరింది. ఎన్‌సిసి సంస్థకు కేటాయించిన నిర్మాణ ప్రదేశంలోకి నీరు ప్రవేశించకుండా చుట్టూ మట్టిని అడ్డుగా ఉంచగా, షాపూర్ జీ పల్లోంజి నిర్మాణ సంస్థ ఆ విధమైన చర్యలు తీసుకోలేదని, ఆ కారణంగానే నీరు చేరిందన్న వాదనలు వినబడుతున్నాయి.

మొదటిపేజీ తరువాయి

గౌతు లచ్చన్న జీవితం ఆదర్శం

విగ్రహానికి పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ గౌతు లచ్చన్న అణగారిన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని పోరాటం చేశారన్నారు. గౌతు లచ్చన్న పోరాట యోధుడే కాదు గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అంటరానితనంపై అలుపెరగని పోరాటం చేశారని, హరిజన, గిరిజన రక్షణ యాత్రలు నిర్వహించారన్నారు. త్వరోనే ఆదరణ 3.0 పథకాన్ని ప్రారంభించనున్నామని, ఈపథకం ద్వారా గీత కార్మికులకు మోపెడ్ ద్విచక్ర వాహనాలు అందజేయబోతున్నామని చెప్పారు. గీత కార్మికులు తాటి చెట్లు ఎక్కడానికి అధునాతన పరికరాలు అందజేయనున్నామన్నారు. రంపచోడవరంలోరి హార్టీకల్చర్ పరిశోధనా కేంద్రంలో నూతన తాటి ఉత్పత్తులు తయారుచేసి, గీత కార్మికులకు ఉపాధి, ఆర్థిక వద్ధి మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న ఎక్కడో ఒడిశా సరిహద్దుల్లో మారుమూల పల్లెలో పేద కుటుంబంలో పుట్టిన ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో గొప్ప పాత్ర పోషించారన్నారు. 95 ఏళ్ల వయస్సులో కూడా దేశానికి సేవ చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ అంటరానితనంపై పోరాడిన గొప్ప వ్యక్తి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న అన్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయించామన్నారు. బీసీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల కోసం, సమాజం కోసం పాటుపడిన వ్యక్తులను ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ గౌతు లచ్చన్న అడుగుజాడల్లో నడుస్తూ ముందు తరాలకు ఆయన స్ఫూర్తి అందిస్తామన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ బీసీలకు రాజకీయ గుర్తింపు కావాలని కోరుకున్న వ్యక్తి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న అని అన్నారు. గౌతు లచ్చన్న మనుమరాలు, శాసనసభ్యులు గౌతు శిరీష మాట్లాడుతూ ప్రజా పోరాటాలు చేసిన నాయకులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. విలువలు, నిజాయితీతో పని చేసిన గొప్ప నాయకుడు గౌతు లచ్చన్న అన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి సహా పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు, అధిక సంఖ్యలో గీత కార్మికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజధానికి తొలగని ముంపు

వాగు కీలక భూమిక పోషిస్తోంది. ఈ వాగు ముంపు సమస్య దాదాపు 50 ఏళ్లుగా కొనసాగుతోంది. 1989లో అప్పటి సిఎం చెన్నారెడ్డి తొలిసారిగా ముంపు నివారణ పథకానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు తొమ్మిది మంది ముఖ్యమంత్రులు మారినా ముంపు సమస్యకి శాశ్వత పరిష్కారం చేయలేకపోయారు. 2014లో అమరావతి రాజధానిగా ఎంపిక అయిన తరువాత ఈ సమస్యపై సిఎం చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. ముంపు నివారణకు ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి నివేదిక తయారు చేయించారు. గుంటూరు జిల్లా మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో కొండలపై కురిసే భారీ వర్షాలకు సంబంధించిన నీరు పేరేచర్ల, బండారుపల్లి, దామరపల్లి, లాం మీదుగా కంతేరు, పెదపరిమి, నీరుకొండ, నిడమర్రు, కృష్ణాయపాలెం, మందడం, మల్కాపురం, వెలగపూడి మీదుగా ఉండవల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. దీనివల్ల రాజధాని గ్రామాలకు ఈ వాగు వల్ల ముంపు సమస్య ఏర్పడటంతో ఉండవల్లి వద్ద సిఎం చంద్రబాబు నాయుడు ఇంటి వద్ద రూ.224.44 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఈవాగుల ద్వారా వచ్చే నీటిని 16 పంపులకు 16 మోటార్లు అమర్చి రోజుకు ఐదువేల క్యూసెక్కుల నీటిని కృష్ణానదిలో ఎత్తిపోసేలా పథకాన్ని 2018 సెప్టెంబరు 18న సిఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఇప్పటికీ పేరేచర్ల నుంచి ఉండవల్లి వరకు ముంపు సమస్య వెంటాడుతోంది. నీరుకొండ వద్ద ఎస్ఆర్ఎం యూనివర్శిటీకి వెళ్లడానికి దారిలేకుండా పోతోంది. గతంలో చేసిన ప్రణాళికలు విఫలం కావడంతో మళ్లీ కొత్త అంచనాలతో రాజధానిలోనే ముంపు నివారణకు సిఆర్‌డిఎ అధికారులు కొత్త అంచనాలతో మళ్లీ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిసింది.

పేరేచర్ల, దామరపల్లి, లాం వద్దకు భారీగా వస్తున్న నీటిని లాం వద్దనే చెక్ డాం, లేదా రిజర్వాయర్ కట్టి ఈ నీటిని గుంటూరు రూరల్ మండలంలోని గ్రామాలకు లేదా తాడికొండ మండలంలోని గ్రామాలకు తాగు, సాగు నీటి కింద వినియోగిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడేది. అలా కాకుండా మొత్తం 35 కిలోమీటర్లు దూరం వాగు నీరు ఉధృతంగా ప్రవహింప చేసి దాదాపు ఐదు మండలాల్లోని 13,500 ఎకరాలలో పంటలను ముంపునకు గురి చేస్తూ చివరికి ఉండవల్లి వద్ద ఎత్తిపోస్తే ప్రయోజనం ఏమిటని పలువురు రైతులు వాపోతున్నారు. మరోవైపు తాడికొండ, గుంటూరు రూరల్ మండలాల్లో ఇప్పటికే పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉంది. ఈ నీటిని లాం వద్ద రూ.225 కోట్లతో ఫిల్టరేషన్ పాయింట్, రిజర్వాయర్ నిర్మించి ఉంటే రాజధానికి ముంపు సమస్య తప్పేది. పొలాలు మునిగి ఏటా రైతులు నష్టపోకుండా ఉంటారు. గుంటూరు రూరల్ మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేది. ఇంజనీరింగ్ నిపుణులు రూ.225 కోట్లు ఖర్చు చేసినా ఇప్పటికీ ముంపు సమస్య ఏటా ఉత్పన్నం అవుతూనే ఉంది. గుంటూరు నుంచి వెలగపూడి సచివాలయానికి వెళ్లేందుకు ప్రతిసారి కోటేళ్ల వాగు వాహనదారులను ఇబ్బంది పెడుతోంది. తాడికొండ మండలం మోతడక, నిడుముక్కల కొండలపై కురిసే వర్షం నీరు పెదపరిమి వద్దకు చేరుతోంది. దీనికి కోటేళ్ల వాగు అని పేరు ఉంది. ఈ రెండు గ్రామాల వద్ద చెక్ డ్యామ్ నిర్మించి అక్కడే చెరువు, రిజర్వాయర్ నిర్మిస్తే ఈ గ్రామాలకు కూడా నీటి ఎద్దడి సమస్య, రాజధాని గ్రామాలకు ముంపు సమస్య రాకుండా ఉంటుంది. ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలు ప్రజాధనం వృథా చేయకుండా వాగుల ద్వారా వచ్చే నీటిని పొలాలు, గ్రామాల్లో ముంపు సమస్య లేకుండా సద్వినియోగం చేసుకుంటే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ దిశగా చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

బ్లాక్‌లో యూరియా

పూర్తి స్థాయిలో ఎందుకు చేరలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

లారీల కొద్దీ ఎత్తేస్తున్న బడాబాబులు

పిఎసిఎస్‌లకు ఎప్పటికప్పుడు చేరిన యూరియాను బినామీల పేరుతో అందినకాడికి లారీల కొద్దీ టిడిపికి చెందిన బడాబాబులు తరలించి, బ్లాక్ చేసుకుంటున్నారు. చిన్న రైతులడిగితే యూరియా అయిపోయింది గాని ఒక అరకట్ట ఇస్తాం తీసుకెళ్లాలని రైతులకు పిఎసిఎస్‌ల సిబ్బంది పొమ్మనకుండా పొగ పెడుతున్నారు. వీరికి సంబంధితాధికారులు కొందరు సహకరిస్తూ తిలాపాపం తలా పిడికెడు అంటూ కమీషన్లకు కక్కుర్తి పడి కాసులు దండుకుంటున్నారు.

ఇంకా ఉధృతంగానే కొండవీటి వాగు

ప్రజాశక్తి- తాడేపల్లి : మంగళగిరి నియోజకవర్గంలో దుక్కదాయనిగా పేరుగాంచిన కొండవీటి వాగు ఇంకా ఉధతంగానే ప్రవహిస్తుంది. రూ.187 కోట్ల రూపాయలతో ప్రకాశం బ్యారేజ్ ఎగువన కొండవీటి వాగు హెడ్ స్లూయిస్ వద్ద గత టిడిపి ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకం నిర్మాణం గావించారు. ఈ పథకం పూర్తయితే తమ పంట పొలాలు ముంపు బారి నుండి బయటపడతాని రైతులు భావించారు. గత వారం రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు కొండవీటి వాగుతో పాటు కోటేళ్ళ వాగు పెద్దఎత్తున పోటెత్తడంతో, ఉండవల్లి వద్ద వాగు ఉగ్రరూపం దాల్చింది. యధావిధిగా వాగు హెడ్ స్లూయిస్ వద్ద నీరు ఎగదన్ని పంట పొలాలను ముంచెత్తింది. దీంతోపాటు రాజధాని నిర్మాణంలో ఉన్న అనేక భవనాల్లోకి నీరు చేరింది. వర్షాలు తగ్గి ముఖం పట్టి రెండు రోజులవుతున్నా నేటికీ ఉండవల్లిలోని ఎత్తిపోతల పథకం వద్ద నీరు భారీ ఎత్తున నిలబడి ఉండి. రెండు పంపుల ద్వారా నీటిని వాగులో నుండి కష్ణానదిలోకి ఎత్తిపోస్తున్నారు. దీనికి తోడు వాగులో గుర్రపు డెక్క, తూటు కాడ పెద్దఎత్తున పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తుంది. ఇరిగేషన్ అధికారులు వాగులో ఉన్న గుర్రపు డెక్క, తూటు కాడను తొలగించేందుకు రెండు ప్రోక్లైనర్లను ఉపయోగించి పనులు చేస్తున్నారు.


గుడివాడలో...


బందరులో నివాళులర్పిస్తున్న కొనకళ్ల

చిరస్మరణీయుడు సర్దార్ గౌతులచ్చన్న

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : స్వాతంత్ర సమర యోధుడిగా, నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడిగా, బలహీన వర్గాలు, రైతు, కార్మిక నాయకుడిగా అనేక ఉద్యమాలను సాగించిన సర్దార్ గౌతు లచ్చన్న మార్గం అందరికీ అనుసరణీయం అని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు పేర్కొన్నారు. శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 116 జయంతిని పురస్కరించుకొని ఆయన ఇతర కూటమి నాయకులతో కలిసి నగరంలోని ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న జీవితమంతా ప్రజల సంక్షేమం కోసమే పాటుపడ్డారని, 1950లో ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకు కాలినడకన పాదయాత్ర సాగించి రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు.


అలాగే జిల్లా పోలీస్ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు, లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి రమేష్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పడమట రంగారావు, గన్నవరం ఎల్ఐసి క్లబ్ గోల్డ్ మెంబర్ పలగాని రాజబాబు, గన్నవరం మండల పార్టీ కార్యదర్శి వేణుగోపాలరావు, మండల నాయకులు మోరం నాగబాబు, పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్** : బందరు బస్టాండ్ సెంటర్లోని లచ్చన్న విగ్రహానికి మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సర్దార్ గౌత లచ్చన్న చిత్రపటానికి ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పూలదండలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి అవనిగడ్డ మోపిదేవి మండలాధ్యక్షులు యా సం చిట్టిబాబు, నడకుదుటి జనార్ధన్ రావు, ఎఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు పాల్గొన్నారు. అలాగే టిడిపి నియోజకవర్గ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గౌతమ్ అచ్చన్న చిత్రపటానికి ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు పూలదండలు వేసి నివాళులర్పించారు. మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధన్ రావు, మండలి రామ్మోహన్రావు, మేడికొండ విజయ్, షేక్ బాబావాలి పాల్గొన్నారు.అలాగే టిడిపి మండల పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ మండల అధ్యక్షుడు యా సం చిట్టిబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి చల్లపల్లి** : చల్లపల్లి మండల టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికారి ప్రతినిధి మోర్ల ప్రసాద్ , మండల టిడిపి అధ్యక్షులు మోర్ల రాంబాబు, సర్పంచ్, పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) డిసి చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : లచ్చన్న సేవాసమితి అధ్యక్షుడు కాగిత కొండ ఆధ్వర్యంలో స్థానిక లూకాస్ స్కూల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పాల్గొని లచ్చన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా స్కూల్లో 35 మంది అనాద విద్యార్థులకు కాగిత కొండ సమకూర్చిన నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ చైర్మన్ జె.పూర్ణచంద్రరావు, కౌన్సి లర్ పద్మావతి, టీడీపీ నాయకులు ఆరేపల్లి సుబ్బారావు పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో నిర్వమించిన ఎంపీడీవో శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు లచ్చన్న చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : కవుతరంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి గ్రామ ప్రముఖులంతా పూల మాలలు వేసి నివాళులర్పించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లమూడి యుగంధర్, మాజీ అధ్యక్షులు బొబ్బా నరసింహారావు, బొబ్బా నరసింహారావు, గౌడ సంఘీయులు ఈడె కృష్ణారావు, పరసా పోతురాజు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : స్థానిక టీడీపీ కార్యాలయంలో గౌతులచ్చన్న చిత్రపటానికి నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ, వీరంకి పావనమూర్తి, పులి శ్రీను,చిట్టూరి నాగేశ్వరరావు, కొండవీటి శివయ్య, గోగినేని రమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కానూరులోని వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో పెనమలూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకార్త దేవభక్తుని చక్రవర్తి, తాడిగడప మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులు వేమూరి బాలకష్ణ, మాదు శ్రీహరి రాణి, కంకిపాడు మండల పార్టీ అధ్యక్షురాలు, షేక్ అబు కలామ్ తదితరులు కూడా లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పించారు. **ప్రజాశక్తి-గుడివాడ** : సర్దార్ గౌతులచ్చన్న నేటి యువతకు ఆదర్శప్రాయులని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక పాత సంతాబజార్ వద్ద గల గౌతు లచ్చన్న విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముడా చైర్మన్ మాట్టాప్రసాద్, టిడిపి నాయకులు గోర్జి సత్యనారాయణ, యార్లగడ్డ సుధరాణి మరీదు రోహిణి పాల్గొన్నారు.


అవనిగడ్డలో...


కంకిపాడులో...

25న ధర్నా జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి-పామర్రు : ఈనెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని రజిక వృత్తిదారులు తరలిరావాలని జిల్లా రజక సంఘం అధ్యక్షుడు పెడసనగంటి పాండురంగారావు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన రజక వృత్తిదారుల సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి నైపుణ్యం కోసం అధునాత పరికరాలు ఇవ్వాలని, రజక వత్తిదారుల సంక్షేమం కోసం మంత్రులతో వేసిన సబ్ కమిటీ కార్యాచరణలోకి రావాలని, ఇల్లు లేని వారికి నివాస స్థలాలు ఇవ్వాలని, వృద్ధాప్య,వితంతు,వికలాంగుల పెన్షన్లను అర్హులకు అందించాలనే డిమాండ్లతో ఆగస్టు 25 సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా కార్యదర్శి కాటూరి నాగభూషణం,రాష్ట్ర కమిటీ సభ్యుడు అవనిగడ్డ రజినీకాంత్,జిల్లా కమిటీ సభ్యుడు వేల్పూరి నాగ దుర్గారావు తదితరులు పాల్గొని ధర్నా పిలుపుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.



శ్రీరంగపురం గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్

ప్రజాశక్తి-పమిడిముక్కల : దాతల సహకారంతో గ్రామాభివృద్ధికి పాటుపడుతున్నట్లు శ్రీరంగపురం గ్రామ సర్పంచ్ దిమ్మెట పద్మావతి అన్నారు.శనివారం ఆమె మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, కరెంటు, రోడ్ల నిర్మాణాలు, పారిశుధ్య పనులు వేగవంతం చేస్తున్నామని ఆమె అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. దాత పంచాంగం వెంకట రంగాచార్య చార్యులు గ్రామానికి కావలసిన నీటి పంపులు లక్ష రూపాయలతో వేయించారని,అలాగే తిరుమల కొండూరి గోపికష్ణ వెంకటరంగమణి దంపతులు పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి లక్ష రూపాయలు ఇచ్చారన్నారు.అలాగే పంపకం రవితేజ పంచాయతీకి రెండు లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారనీ, పి జె జీవి రంగాచార్యులు శ్మశాన వాటికకు లక్ష ఇరవై ఐదు వేల రూపాయలు విరాళంగా ఇచ్చారన్నారు. సర్పంచ్‌గా తాను అంగన్వాడీ స్కూల్‌కు కావలసిన కుర్చీలు, బెంచీలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వల్లభనేని బాబు పాల్గొన్నారు

క్రీడలతోనే జాతీయస్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-గన్నవరం : క్రీడలతోనే జాతీయస్థాయి గుర్తింపు క్రీడాకారులకు లభిస్తుందని సర్పంచ్ నిడమర్తి సౌజన్య అన్నారు. గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రాష్ట్ర వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం వైస్ చైర్మన్ కె.వి.ఆర్ కిషోర్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరుగనున్న గన్నవరం నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కిషోర్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. వైస్ చైర్మన్ కె.వి.ఆర్ కిషోర్ మాట్లాడుతూ.. నాలుగు రోజులపాటు వాలీ బాల్ పోటీలు జరుగుతాయని, గెలుపొందిన జట్లకు నగదు రివార్డులతో పాటు షీల్డ్ అందిస్తామన్నారు. ఈ పోటీలకు నియోజక వర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల నుంచి 20 టీములు పాల్గొంటారని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పారా రామకష్ణ, నిడమర్తి నాగేశ్వరరావు, సూర్యచంద్రరావు, ముక్కామల సుబ్బారావు, బాబురావు, సగ్గుర్తి శ్రీనివాసరావు, జగదీశ్వరరావు, టి ఎస్ ఆర్ కే ప్రసాద్ పాల్గొన్నారు.


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ సౌజన్య

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరం ప్రారంభిస్తున్న వెంకట్రాం

ప్రజాశక్తి-ఘంటసాల : ఉచిత వైద్య శిబిరం నిర్వహణ అభినంద నీయమని నియోజక వర్గ యువ నాయకులు మండలి వెంక ట్రామ్ అన్నారు. శనివారం ఘంటసాల మండలం లంకపల్లి జడ్పీ హైస్కూలులో దివంగత యార్లగడ్డ శివరామకృష్ణ - జయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, గ్రామ ప్రముఖుడు యార్లగడ్డ వెంకట కిరణ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండలి వెంకట్రామ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ శిబిరంలో విజయవాడ స్వర సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ నుంచి ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, డెంటల్, కార్డియాలజీ వైద్యులు విచ్చేసి ఉచిత వైద్య సేవలు అందచేశారు. ఈ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 475 మంది పేదలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్, కొమ్మారెడ్డి లీలాకష్ణయ్య, యార్లగడ్డ వీరభద్రరావు, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, దిరిశం వెంకట్రావు, గుత్తికొండ వరప్రసాద్, కనుమూరి సుబ్రహ్మణ్యం, కొల్లూరి సాయిరాం పాల్గొన్నారు.

'స్త్రీశక్తి' పథకం పరిశీలన



ప్రజాశక్తి-చల్లపల్లి : ఎన్నికలలో మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు మోర్ల రాంబాబు, తెలుగు మహిళా జిల్లా కార్యదర్శి పైడిపావుల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం సద్వినియోగాన్ని పరిశీలించేందుకు కూటమినేతలు శనివారం బస్టాండ్‌ను సందర్శించారు. ఆర్టీసీ బస్సు కోసం వేచి ఉన్న మహిళలతో మాట్లాడారు. బస్సులోకి ఎక్కి మహిళలు అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఈ పథకం మహిళలకు వరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ నిడమానూరు దిలీప్, కృష్ణాజిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు మోర్ల శివ, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి , ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో చెత్త సమస్య పరిష్కరించాలి : సిపిఎం


చెత్తను చూపిస్తున్న ఆర్ సి పి రెడ్డి

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ టిడ్కో కాలనీలో రోడ్లు నిండా చెత్తా చెదారంతో నిలిచి దుర్వాసన వస్తుందని అధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించాలని సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టిడ్కో కాలనీలో ఆర్‌సిపి రెడ్డి శనివారం పర్యటించి మాట్లాడుతూ గతంలో స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కి తెలియజేయగా వారానికి రెండుసార్లు చెత్త ఎత్తే విధంగా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేశారని, కానీ సమస్య అలాగే ఉందని, రోడ్లు మొత్తం చెత్త ఎక్కడికక్కడే పేరుకు పోయి ఈగలు, దోమలు చేరి ప్రజలకు అంటువ్యాధులు, విష జ్వరాలు వ్యాపిస్తున్నా యన్నారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం వారు స్పందించి తక్షణమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనజ తదితరులు పాల్గొన్నారు.

ఎసిఎ ప్రతిష్టను మరింత పెంచుతాం

- నూతన అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని శివనాథ్, సానా సతీష్ బాబు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

రాబోయే మూడేళ్ల ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ద్వారా రాష్ట్రంలో క్రికెట్‌ను మరింతగా అభివద్ధి చేస్తామని, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్ట మరింతగా పెంచుతామని ఎసిఎకు నూతన అధ్యక్షుడిగా, కార్యదర్శిగా ఎన్నికైనా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు అన్నారు. తాడేపల్లిలోని విజయవాడ క్లబ్‌లో శనివారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు 2025-2028కి సంబంధించిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎక్రగ్రీవంగా ఎన్నికైన ఈ కమిటీకి అధ్యక్షుడిగా ఎంపి కేశినేని శివనాథ్, సెక్రటరీగా సానా సతీష్ బాబు , కోశాధికారిగా దండమూడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ గా బి. విజయ్ కుమార్, కౌన్సిలర్ గా దండు గౌర్ విష్ణు తేజ్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియ ఎలాంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా సాగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించడానికి కషి చేస్తామన్నారు. అలాగే క్రీడాకారులు ఐపీఎల్‌లో ఆడేందుకు కావాల్సిన సపోర్టింగ్ స్టాఫ్‌తోపాటు కోచ్‌లను నియమించే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఏసీఏ ఆధ్వర్యంలో వైజాగ్‌లో జరుగుతున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ విజయవంతంగా సాగుతుందని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ పదవికి బండారు నరసింహారావు ఒక్కరే నామినేషన్ వేయగా, అధికార ధ్రువీకరణ పత్రాలు వివరాలు సరిగ్గా లేకపోవటం వల్ల నామినేషన్ తిరస్కరణకు గురైందని, సెప్టెంబర్‌లో వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలు జరుగుతాయన్నారు.. ఈ సమావేశంలో ఎసిఎ మాజీ జాయింట్ సెక్రెటరీ, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కూడా పాల్గొన్నారు.



మలబార్ గోల్డ్ షోరూమ్‌లో 'వ్యాన్' అవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్


ప్రముఖ ఆభరణాల వ్యాపార సంస్థగా పేరుగాంచిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, ప్రతి మహిళ తన ప్రత్యేకతను చాటుకుంటూ, వేడుక చేసుకునే అద్భుతమైన సరికొత్త రత్నాభరణాల సేకరణ అయిన వ్యాన్'ను శనివారం ప్రారంబించింది. ఎంజి రోడ్డులోని మలబార్ షోరూం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాహకులు వివరాలను తెలిపారు .ఈ సందర్భంగా షోరూం మార్కెటింగ్ మేనేజర్ ఖాసిం మాట్లాడుతూ వజ్రంతో ప్రేరేపితమైన తేజస్సును, వర్ణరంజితమైన శక్తివంతమైన రత్నాలను, 18, 22 క్యారట్ల బంగారంతో ఎంతో శ్రద్ధగా 'వ్యాన'ను సుందరంగా రూపొందించారని తెలిపారు. వివిధ పాత్రల్లో, విభిన్న సంప్రదాయాల్లో సులభంగా ఒదిగిపోతూ , మారుతున్న కాలానికి అనుగుణంగా సులభంగా మారుతున్న ఆధునిక భారతీయ మహిళలకు ఇవి సరైన ఆభరణాలు.అన్నారు.జెమ్ స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్లో సొగసైన 'వ్యాన' కలెక్షన్తో పాటు, అద్భుతమైన రత్నాలు మరియు అన్కట్ వజ్రాలతో కూడిన సాంప్రదాయ ఆభరణాల సేకరణను మలబార్ గోల్డ్ %డ% డైమండ్స్ ప్రదర్శిస్తుంది అని తెలిపారు. ఈ ఫెస్టివల్లో భాగంగా, వినియోగదారులు అన్ని రకాల రత్నాలు , అస్కట్ వజ్రాల ఆభరణాల తరుగు ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపును పొందవచ్చు అన్నారు.. ఈ ప్రత్యేక ఆఫర్ సెప్టెంబర్ 7 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.కల్వర్మ, ఎస్.సునయన, ఎన్.ప్రియ, షేక్ రాజీ, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలి

- బిసి నేత కోసూరి ప్రహ్లాద్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

ఒబిసి విద్యార్థులకు నష్టదాయకంగా ఉన్న క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలని ఎపి బిసి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి ప్రహ్లాద్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్న ఓబీసీల సమగ్రాభివృద్ధికి, మండల్ కమిషన్ విద్యా- ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ రిజర్వేషన్ల అమలుకు క్రీమీలేయర్ పేరిట ఆదాయపరిమితిని విధించడం అన్యాయమని, దాన్ని తొలగించాలని దశాబ్దాలుగా ఓబీసీ సంఘాలు ఉద్యమిస్తూనే ఉన్నాయన్నారు. క్రీమీ లేయర్ నిబంధన ఉన్నప్పటికీ నిర్దుష్ట కాలపరిమితితో నిరంతరం పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా, ఆదాయ పరిమితిని పదేళ్లయినా సవరించకపోవడం దుర్మార్గమన్నారు. అందుకే ఈసారి క్రిమిలేయర్ ఆదాయ పరిమితిని కనీసంగా రూ 16 లక్షలకు సవరించాలని కోరారు.



ఉత్తమ డీలర్ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-విస్సన్నపేట

విసన్నపేట మండలం చంద్రుపట్ల గ్రామం రేషన్ డీలర్ చిల్లపల్లి జమలయ్య ఉత్తమ డీలర్‌గా అవార్డు పొందిన సందర్భంగా లంబాడి తండా గ్రామ పంచాయతీ తరపున గ్రామ సర్పంచ్ ధారావత్ బోడి సూర్య దంపతులు, ఎంపిటిసి పాప ఘనంగా శాలువాతో సత్కరించ ఆరు. మరెన్నో అవార్డులు పొందాలని, భవిష్యత్తులో గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కాల్వ పూడికతీత పనులు చేపట్టాలి

- సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బి సత్యబాబు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విజయవాడ 46వ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో శనివారం సిపిఎం బృందం శనివారం పర్యటించింది. అంబేద్కర్‌నగర్‌లో అవుట్ ఫాల్ డ్రెయిన్ షిల్ట్ తొలగించకపోవడం వల్ల చిన్నపాటి వర్షానికి కాలువలోని మురుగునీరు ఇళ్లల్లోకి వస్తుందని, మురుగు ముంపుతో ఇబ్బందులు పడుతున్నారని ప్రజల ఫిర్యాదు మేరకు సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ వైఫల్యం కారణంగా చిన్నపాటి వర్షాలకి నగరంలో రోడ్లు చెరువులను తలపించే రీతిలో ఉన్నాయని తెలిపారు. అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో షిల్టు తొలగించకపోవడం వల్ల వృద్ధాలు పెరిగిపోయి చిన్నపాటి వర్షానికే ఇల్లు ముంపు గురవుతున్నాయని తెలిపారు. విఎంసి కమిషనర్ స్పందించి కేఎల్ రావు నగర్ ఔట్ఫాల్ డ్రెన్ షిల్ట్‌ను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కోతుల దాడుల నుంచి డివిజన్ వాసులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంలో గాయపడ్డ జన సైనికుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం గంగినేని గ్రామానికి చెందిన పసుపులేటి పవన్ కుమార్ ఈ నెల 3న మైలవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి పడిపోయి తీవ్రగాయాలు పాలయ్యారు. ఈ విషయాన్ని గంగినేని జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు రావుల వెంకట్రావు, మండల కమిటీ మెంబరు సురకత్తుల వెంకటేశ్వరావు... జనసేన పార్టీ ఉమ్మడి కష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు బొళియశెట్టి శ్రీకాంత్ దష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించి శనివారం పవన్ కుమార్ దంపతులకు రూ.25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు నగదు అందజేశారు.



ఇబ్రహీంపట్నంలో శాంతి భద్రతలను పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

పశ్చిమ ఇబ్రహీంపట్నంలో పశ్చిమ డివిజన్ ఎసిపి దుర్గారావు శనివారం పర్యటించారు. కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టే ప్రాంతంలో శాంతి భద్రతలను పరిశీలించారు. గతంలో రెండు సామాజిక వర్గాల మధ్య విభేదాలు ఉన్న నేపథ్యంలో ఎటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎటువంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉట్టికొట్టే కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది.

శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు జెవివి కృషి

- జెవివి పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

సామాన్య ప్రజల్లో శాస్త్ర విజ్ఞానం ప్రచారం చేయడం, శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక కషి చేస్తుందని జెవివి పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. కొండపల్లి పట్టణంలో జన విజ్ఞాన వేదిక 18వ మహాసభ స్థానిక ఎస్.మహాబాషా ప్రాంగణం (క్రాంతి హైస్కూల్)లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేయడమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వి.మురళీమోహన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు, సైన్స్ పట్ల అభిరుచిని పెంచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జెవివి గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెవివి నగర ప్రధాన కార్యదర్శి వెలగా శ్రీనివాస్, జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డి.జోనీ కుమారి, డాక్టర్ మామిడి సీతారామారావు, అధ్యక్షుడిగా ఎ.యల్లమందయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాగరాజు, కోశాధికారిగా ఎస్.కె.సర్దార్ సాహెబ్, నలుగురు ఉపాధ్యక్షులు, నలుగురు కార్యదర్శులు, ఎనిమిది మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జయంతిపురంలో ఎమ్మెల్యే తాతయ్య పర్యటన

ప్రజాశక్తి- జగ్గయ్యపేట

జగ్గయ్యపేటలోని జయంతిపురం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరదనీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్వయంగా గ్రామానికి వెళ్లి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వరద నీరు బయటకు వెళ్లేందుకు కాలువలకు పూడికతీత పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని తెలిపారు. వరి పంటపై తలెత్తిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

మురుగునీటితో పంటపొలాల మునక

● వి.కొత్తపాలెం రైతుల సమస్యలకు పరిష్కారం ఎప్పుడు..?


డ్రైన్ కాలువలో నుంచి పంట కాలువలకి గండి కొట్టిన దృశ్యం

ప్రజాశక్తి-కోడూరు : ఎన్ని ప్రభుత్వాలు మారినా వి.కొత్తపాలెం రైతుల సమస్యకు పరిష్కారం మాత్రం దొరకటం లేదు. కోడూరు ప్రధాన పంట కాలువకు కుడిపక్క వి.కొత్తపాలెం గ్రామ సమీప భూములలోని మురుగునీరు రత్నకోడు క్యాచ్ డ్రైన్ ద్వారా రత్నకోడు మేజర్ డ్రైన్ లోకి వెళ్లాల్సి ఉంది. రత్నకోడు మేజర్ డ్రైన్ కావడంతో భారీ వర్షం కురిసినప్పుడు వి.కొత్తపాలెం గ్రామ సమీప పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయి. దీనికి పరిష్కారం జయపురం గ్రామం వద్ద ప్రధాన వంటకాలువ కిందగా రోడ్డు ఇటుపక్కకు తూములు వేసి లింగన్నకోడు క్యాచ్ డ్రైన్ లోకి కలిపితే సమస్య పరిష్కారం అవుతుందని రైతులు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకునే నాధుడే లేకపోవడంతో ఈ పరిస్థితి గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉంది. వీరికి వేరే ప్రత్యామ్నాయ పరిస్థితి లేక పంట కాలువకు గండి కొట్టాల్సి వస్తుంది. ఇదిలా ఉండగా అవనిగడ్డ నుంచి కోడూరు ప్రధాన పంట కాలువకు 42 సబ్ బ్రాంచ్ కాలువలు ఉన్నాయి. ఆధునీకరణ పనులలో భాగంగా 40 కాలువలకు పాత షటర్లు తొలగించి ప్రత్యేక స్ట్రక్చర్ తో మోడరేషన్ పనులు చేశారు. రెండో నెంబర్ పంట కాలువ పూర్తిగా మెరక కావటంతో దానిని పునర్నిర్మానం చేయలేదు. కానీ జయపురం వద్ద ఉన్న ఆరో నెంబర్ పల్లపు పంట కాలువ స్ట్రక్చర్ మాత్రం ఈరోజు వరకు ఎటువంటి మార్పు చేయలేదు. ఈ కాలువ పునర్ నిర్మాణం చేయాలని, నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న పాత వంతెన తొలగించాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత పిసీ చైర్మన్ గతంలో ఎన్నో స్టేట్మెంట్లు ఇచ్చారు. కానీ వారు అధికారంలోకి వచ్చాక మాత్రం వాటిపై నోరు మెదప పోవడంతో గమనార్హం. కటిక మెరక కాలువైన 11 నెంబర్ కాల్వ స్ట్రక్చర్ మార్చారు కానీ, బాగా పల్లమైన ఆరో నెంబర్ పంట కాలవ స్ట్రక్చర్ మాత్రం మార్చలేదు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు రైతులకు సమస్యకు శాశ్వత పరిష్కారం జరిగే విధంగా జయపురం గ్రామం వద్ద లింగన్న కోడు క్యాచ్ డ్రైన్ లోకి పంట కాలవ క్రింద తూములు వేయాలని, ఆరో నెంబర్ పంట కాలువ పునర్ నిర్మాణం చేయాలని రైతులు ముక్తకంఠంతో కోరుచున్నారు.


జయపురం వద్ద నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న పాత వంతెన


ఆధునీకరణ పనుల్లో భాగంగా పాత స్ట్రక్చర్ మార్చకుండా ఉంచిన ఆరో నెంబర్ పంట కాలువ



అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గుడివాడ : భారతీయులందరికీ భారత రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దైవ సమానుడని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక నెహ్రూ చౌక్ సెంటర్లో బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహ శంకుస్థాపన కార్యక్రమాన్ని అంబేద్కర్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, బౌద్ధ గురువులు బౌద్ధ సంప్రదాయం ప్రకారం విగ్రహానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు గుడివాడ పట్టణంలో ప్రధాన మైన నెహ్రూ చౌక్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి శంకుస్థాపన చేసుకోవడం సంతోషకరమన్నారు. సెప్టెంబర్ 10వ తేదీ కల్లా కాంస్య విగ్రహం గుడివాడ వస్తుందన్నారు. సెప్టెంబర్ 30 తేదీన విగ్రహ ఆవిష్కరణ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్మాకరరావు, జనసేన నాయకలు బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళీ పాల్గొన్నారు.


కొనకళ్ల మధులతకు ఎగ్ కార్ట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మహిళల ఆర్థిక స్వావలంభనకు కృషి : బోడే

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో స్వయం ఉపాధి కల్పించుకుని ఆర్థిక స్వావలంభన సాధించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. చినఓగిరాల తేజశ్రీ సంఘానికి చెందిన కొనకళ్ల మధులతకు వెలుగు ఎస్ఈ ఆర్పి ద్వారా మంజూరైన ఎగ్ కార్డును ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహిళల సక్షేమం, అభివద్ధి కొరకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, సర్పంచ్ శిరీష, పీఏసీఎస్ అధ్యక్షుడు పాల డుగు రామకష్ణ, పార్టీ నాయకులు వత్సవాయి ఏడుకొండలు, పా ల్గొన్నారు.

బాధ్యత మరచిన అధికారులు

ప్రజాశక్తి-గన్నవరం : జాతీయ జెండా నియమాలను ఉల్లంఘించిన వైనం చర్చనీయాంశమైంది. ఇదెక్కడా అనుకుం టున్నారా.. గన్నవరం నియోజక వర్గం లోని బాపులపాడు మండలం బండారు గూడెం సచివాలయంలో నెలకొన్న పరిస్థితి. ఆగస్టు 15న సచివాలయ అధికారులు జెండా ఆవిష్కరణ చేసి సంబరాలు జరుపుకున్నారు. అయితే సాయంత్రం ఐదు గంటలకు జెండా దింపి తీసివేయాలి. ఆ విషయం మర్చిపోయి అధికారులు, సిబ్బంది ఎవరు ఇళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయారు. శనివారం కూడా జెండా ఎగురుతూనే ఉంది. వరుస సెలవులు కావడంతో ఆదివారం సేమ్ పరిస్థితి. సోమవారం పంచాయతీ కార్యదర్శి వస్తే జెండా తీస్తారు? లేకపోతే అంతే సంగతి. సచివాలయ అధికారులే జాతీయ జెండాను గౌరవించని పరిస్థితిని చూసి గ్రామస్తులు విస్తుబోతున్నారు.


రెండు రోజులైనా దించని జెండా


నగదు బహుమతులు అందిస్తున్న దృశ్యం

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ మండలం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హై స్కూల్లో 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు కూచిపూడి సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఏలేశ్వరపు ప్రశాంత్ కుమార్ నగదు బహుమతులు అందజేశారు. వక్కలగడ్డ మౌనిక హర్షిత, కంచర్ల గాయత్రి అరుణ, నజియా, రమ్య, ఈశ్వరసాయిశ్రీ, యశశ్రీలకు రెండు వేల రూపాయలు, ఐదు వందల రూపాయల నగదు బహుమతి అందించారు. అలాగే ఆపాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు జొన్నలగడ్డ కవిత.. మౌనిక హర్షిత, కంచర్లగాయత్రిలకు కూడా వెయ్యి రూపాయల నగదు అందజేశారు. వీరిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమి రెడ్డి అనుపల్లవి భువనేశ్వరి అభినందించారు.

రమణయ్యనాయుడుకు నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : రావు బహుదూర్ కొల్లిపర వెంకట రమణయ్య నాయుడు జయంతిని శనివారం మచిలీపట్నంలో ఘనంగా జరిపారు. రేవతి సెంటర్‌లోని ఆర్కే గుడ్ టైమ్స్ ఎదురుగా ఉన్న రమణయ్య నాయుడు విగ్రహానికి మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. జనసేన పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొన్నారు

పిఎసిఎస్ అధ్యక్షులకు సన్మానం


ఎంఎల్ఏ బుద్ధప్రసాద్‌ను కలిసిన పిఎసిఎస్ అధ్యక్షులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : పిఎసిఎస్ అధ్యక్షులు రైతుల అభిమానం చూరగోనేల సేవ చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. శనివారం సాయంత్రం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజక వర్గంలోని 30 సహకార సంఘాలకు నూతనంగా నియమితులైన త్రిసభ్య కమిటీ అధ్యక్షులకు సభ్యులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు సేవ చేసేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి సంఘాల ప్రతినిధులు సమర్ధవంతంగా పనిచేయడంతో ఇటీవల వచ్చిన భారీ వర్షాల ముంపు సమస్యను విజయవంతంగా పరిష్కరించినట్లు చెప్పారు. నూతన సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రతినిధులు రైతాంగానికి యూరియా సరఫరా క్రమ పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, జనసేన ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, సీనియర్ నాయకులు బచ్చు వెంకటాద్రి ప్రసాద్ పాల్గొన్నారు

ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఉయ్యూరు : హమాలీ ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్ళం వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు శ్రామిక భవనంలో జిల్లా హమాలీ /ముఠా వర్కర్స్ యూనియన్ మరియు ఏపీ పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర ముఠా యూనియన్ కృష్ణా జిల్లా 9వ మహాసభ బూర సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా కళ్ళం వెంకటేశ్వరావు మాట్లాడుతూ హమాలీ, ముఠా కార్మికులులకు ప్రమాద బీమాని ప్రభుత్వం ఏర్పాటు చేయాలనీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సివిల్ సప్లై లో పనిచేస్తున్న ముఠా కార్మికులను 4తరగతి ఉద్యోగులుగా గుర్తించి, కనీసవేతన నిర్ణయం చేయాలి అని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లాహమాలీ /ముఠా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బూర. సుబ్రహ్మణ్యం, అధ్యక్షులుగా అనగానిశివ శంకర ప్రసాద్. (ఉయ్యూరు), ఉపాధ్యక్షులుగా గుడివాడ (కోఆప్షన్), ప్రధాన కార్యదర్శిగా జొన్నలగడ్డ నాగశివ (మచిలీపట్నం), సహాయ కార్యదర్శిగా పి. శ్రీను (గన్నవరం), కోశాధికారిగా ఖాజ నాగరాజు (హనుమాన్ జంక్షన్), కమిటీ సభ్యులుగా ముత్యాల ఏడుకొండలు(చల్లపల్లి), కొమ్మ రాంబాబు (మచిలీపట్నం), ఆంజనేయులు (పామర్రు), జంపాన చింతయ్య (ఉయ్యూరు)లు నియమితులయ్యారు.



మాట్లాడుతున్న కళ్ళం వెంకటేశ్వరావు

చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని 15వ వార్డు ఇందిరా కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో శనివారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి రేష్మా బేగం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఈ టీకాలు వేశారు. భవిష్యత్తులో చిన్నారులకు కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, పోలియో, తట్టు, మెదడు వాపు వంటి వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేసినట్లు రేష్మా బేగం తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ కె.రవి, హెల్త్ విజిటర్ శ్యామల పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

మైలవరం: మైలవరంలో శ్రీ కృష్ణాష్టమి పర్వదినం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యాదవుల బజార్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ సుఖ సంతోషాలతో ఆరోగ్యవంతులుగా మంచి విజయాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ట్రాక్టర్లపై పురవీధుల్లో ఊరేగించారు.

విజయవాడ సిటీ : కృష్ణాష్టమి సందర్భంగా శనివారం ఇంద్రకీలాద్రి పై కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం గోపూజ నిర్వహించగా సాయంత్రం ఉట్టి కొట్టే వేడుకలు ఘనంగా జరిగాయి.

జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 381 మంది ప్రజలు వైద్య సేవలు పొందారు. అవసరమైన ప్రతి ఒక్కరికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు కౌన్సిలర్ కంచేటి గీతారాణి, శిబిర కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు మైనేని రాధా కృష్ణ, ముల్లంగి రామకృష్ణారెడ్డి, యానాల గోపీచంద్, ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, ఫౌండేషన్ వాలంటీర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆర్పీలు, వాగ్దేవి కాలేజీ నర్సింగ్ విద్యార్థినులు, వాగ్దేవి కళాశాల ఆర్ఎస్ఎస్ విద్యార్థినులు విశేష సేవలు అందించారు.

దేశ సమైక్యతను కాపాడుకుందాం

50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 50వ డివిజన్ ప్రజా సంఘం ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ మహంతిపురం ఖాదర్ సెంటర్లో కార్పొరేటర్ బోయి సత్యబాబు ఆవిష్కరించారు. భగత్‌సింగ్ ఆటోస్టాండ్ సెంటర్‌లో కె.బి.టాలెంట్ ప్రిన్సిపల్ ఎస్కే ఖాదర్బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బి.సత్య బాబు, మాజీ కార్పొరేటర్ జి ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాద దోపిడీ నుండి స్వాతంత్ర్య సాధన కోసం పోరాడిన నాటి భారతీయులను మతాల పేరుతో విభజిండం దారుణమన్నారు. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లైనా ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం, ఇల్లు, ఉపాధి నేటికీ అందని ద్రాక్షగానే ఉందని తెలిపారు. నేటి పాలకులు ప్రజల సమస్యలను పరిష్కరించకుండా బ్రిటీష్ పాలకుల మాదిరిగా మతాల మధ్య విద్వేషాలు పెంచుతూ విభజించు పాలించు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. స్వతంత్ర పోరాట స్ఫూర్తితో దేశ సమైక్యతను లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా సమైక్యత ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పి రాజు, కొండ ప్రాంతాలు అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఎస్ డి భాషా, ఆవాజ్ నగర నాయకులు ఎండి రిజ్వాన్, సిఐటియు నాయకులు జి సుబ్బారెడ్డి, పౌర సంక్షేమ సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

- జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ : దేశ ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించేందుకు అవిరళ కృషి చేసిన గొప్ప వ్యక్తుల్లో సర్దార్ గౌతు లచ్చన్న ఒకరని.. ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంతో పాటు వివిధ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న పాటుపడ్డారని.. ఆయన పాటించిన విలువలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందడుగు వేయాలని సూచించారు.

మైలవరం : సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని మైలవరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. లచ్చన్న విగ్రహానికి ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. బలహీన వర్గాలు రైతులు, కార్మికుల సంక్షేమం కోసం లచ్చన్న చేసిన ఉద్యమాలు స్ఫూర్తిదాయకమని ఆయన సేవలను ఎమ్మెల్యే వసంత కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఇబ్రహీంపట్నం : కొండపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం మాజీ మండల ప్రధాన కార్యదర్శి సాకిరి వెంకట నరసయ్య ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి పురపాలక సంఘం అధ్యక్షులు చుట్టుకుదురు శ్రీనివాసరావు, కొండపల్లి మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు చిమాట ప్రసాద్, మైలవరం నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజు, మైలవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొత్తపల్లి ప్రకాష్, గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బసవ ఉమామహేశ్వరరావు, ఇబ్రహీంపట్నం పిఎసిఎస్ డైరెక్టర్ రాగాల చిన్న జమలయ్య, కౌన్సిలర్ అడపా వెంకయ్య, సాకిరి మోహన మురళీకృష్ణ పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మండలంలోని చిల్లకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయం శనివారం డాక్టర్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి మాధవ శర్మ, సీనియర్ సహాయకులు డి.కిశోర్ కుమార్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రెయినేజీల్లో పూడికతీత

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

రెడ్డిగూడెం మండల పరిధిలోని అన్నేరావుపేట గ్రామంలో డ్రెయినేజీలో పూడికతీత పనులను సర్పంచ్ బాణావతు ప్రశాంతి ఆధ్వర్యంలో చేపట్టారు. అన్నేరావుపేట గ్రామంలో వర్షాలు పడి డ్రెయినేజ్ వల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదని ముందు జాగ్రత్తగా డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టి సెల్ నాయకులు బాణావతు రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మైలవరంలో దొంగలు హల్ చల్

ప్రజాశక్తి-మైలవరం

మైలవరంలో దొంగలు హల్చల్ చేస్తున్నారు. రెండు మూడు రోజులకు ఒక వీధిలో దొంగతనాలు జరుగుతున్నాయి. కొన్ని వీధుల్లో, ఇళ్లల్లో సిసి కెమెరాలు ఉన్నా దొంగతనాలు చేయటం ఆగటం లేదు. పట్టుకోండి చూద్దాం అంటూ పోలీసులకే సవాల్ విసురుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారుల ప్రక్కన ఉన్నటువంటి చిన్న చిన్న దుకాణాలు, గృహాలనే టార్గెట్ చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం జనతా గ్యారేజ్ సమీపంలో ఉన్న చిరు వ్యాపారస్తుల పానీ పూరి గది తలుపులను పగలగొట్టే ప్రయత్నం చేశారు. ఐదు రోజుల క్రితం యాదవుల బజారులోని ఒకరి ఇంటిలో దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా చుట్టుపక్కల వారు గమనించి అరవడంతో పారిపోయారు. గురువారం రాత్రి 11 గంటల సమయంలోనే ఎస్సీఎస్ నగర్‌లో ఉన్నటువంటి వేమిరెడ్డి వసంత రెడ్డి ఇంట్లో ప్రవేశించి నాలుగు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ఇంట్లో వాళ్ళు మేల్కొని ఉండటంతో ఏదో శబ్దం అవుతుందని విని అరవడంతో కారు అద్దాలను పగలగొట్టి పరారయ్యారు. దేవుని చెరువులో 15 రోజుల క్రితం రాత్రి వేళల్లో ఇంటి తలుపులు పగలగొట్టే ప్రయత్నం చేస్తుండగా నిద్రిస్తున్న వారు మేల్కొని కేకలు వేయడంతో పరారయ్యారు. మైలవరంలో ఏ వీధి చూసిన స్థానికులు దొంగలు బాబోయ్ దొంగలు అంటున్నారు. ఏదైనా శుభకార్యానికి వెళ్ళాలన్నా భయంగా ఉందని స్థానికులు అంటున్నారు. ఎప్పుడు ఎవరు వచ్చి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్నటువంటి విలువైన సామాగ్రి దోసుకుపోతారేమోనని భయంగా ఉందని గృహిణిలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ తిరిగేవారు. ఇటీవల పోలీసుల నిఘా తప్పిందని, అందువలన దొంగలు విచ్చలవిడిగా సంచరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అంకిత భావంతో పని చేసిన వారికే పదవులు

- ఎపి కేశినేని శివనాథ్
- కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కోగంటి బాబు ప్రమాణ స్వీకారం

కంచికచర్ల: తెలుగుదేశం పార్టీకి అంకిత భావంతో పనిచేసిన వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి అభ్యున్నతికి పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని దానికి నిదర్శనమే కోగంటి బాబు అని ఎపి కేశినేని శివనాద్ (చిన్ని) అన్నారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్ చైర్మన్‌గా కోగంటి వెంకట సత్యనారాయణ (బాబు) శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎఎంసి చైర్మన్‌గా కోగంటి బాబు, వైస్ చైర్మన్‌గా తోట రవిబాబు, మార్కెట్ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకం రాష్ట్రంలో విజయవంతమైందని తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. ఐదేళ్లలో వెనుకబడిన నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి పాలకవర్గం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజ గోపాల్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు చెరుకూరు రాజేశ్వరరావు, ఎఎంసి మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ, నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ అధ్యక్షుడు కోట వీరబాబు, నందిగామ మున్సిపల్ చైర్మన్ మండవ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపి కేశినేని

కంచికచర్ల లో టిడిపి భారీ ర్యాలీ

కంచికచర్ల మార్కెట్ యార్డు చైర్మన్‌గా కోగంటి బాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా కంచికచర్ల లో టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్‌గా కోగంటి వెంకట సత్యనారాయణ (బాబు) శనివారం సాయంత్రం స్థానిక మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రమాణ స్వీకారానికి ఎడ్ల బండిపై ర్యాలీగా వెళ్తున్న కోగంటి బాబు

కోగంటికి సన్మానం

కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న కోగంటి బాబుని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఘనంగా సన్మానించారు. శనివారం సాయంత్రం కంచికచర్ల వ్యవసాయ మార్కెట్లో ప్రమాణ స్వీకార సందర్భంగా కోగంటి బాబును మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కంచికచర్ల యార్డులో కలిసి ఘనంగా సన్మానించారు. చైర్మన్‌గా ఎఎంసిని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్‌ను కూడా కోగంటి బాబు శాలువా కప్పి సన్మానించారు.



పాతఎడ్లలంకలో వరదను పరిశీలించిన విక్కుర్తి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల కృష్ణా నదికి వచ్చిన వరదలతో అవనిగడ్డ మండల పరిధిలోని పాత ఎడ్ల లంక గ్రామం వరద ఉధతికి గురికావడంతో ఆ గ్రామాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త కూటమి నాయకులు విక్కు ర్తి వెంకట శ్రీనివాసరావు పరిశీలించారు. శనివారం ఆ గ్రామాన్ని పడవపై వెళ్లి సందర్శించిన ఆయన ఎగువ నుంచి వరద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో నీటి ప్రవాహ పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న తాసిల్దార్ నాగమల్లేశ్వరరావును కలసి వరద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్. విక్కు ర్తి రాంబాబు, న్యాయవాది విక్కు ర్తి రామకష్ణ, పులిగడ్డ చంద్ర భూపతి పాల్గొన్నారు



మాట్లాడుతున్న నాయకులు

రైతులకు యూరియా అందించాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-బంటుమిల్లి : స్థానిక గుండా బత్తుల ఆంజనేయులు భవనంలో బంటుమిల్లి, కత్తివెన్ను మండల రైతు సంఘాల సమావేశం పుప్పాల నరసింహారావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో రైతులకు, కౌలు రైతులకు సహకార సంఘాల ద్వారా, రైతు సేవ సంఘాల ద్వారా యూరియా, పొటాష్ ఎరువులను అవసరం మేరకు అందించాలని నాయకులు కోరారు. అలాగే కాలువల్లో గుర్రపు డెక్క, కిక్కిరస తొలగించాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, బంటుమిల్లి మండల రైతు సంఘ కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, కత్తివెన్ను మండల రైతు సంఘం అధ్యక్షులు పట్టపు ఏసుబాబు, వెంట్రపాటి శ్యామ్ సుందర్, గౌరిశెట్టి వెంకటనారాయణ పాల్గొన్నారు.

వరిలో వెదసాగుతో మేలు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు

ప్రజాశక్తి-గన్నవరం : పండిన పంట చేతికొచ్చే తరుణంలోనే ఓ వైపు వర్షాలు, ఇతర వైపరీత్యాలు.. మరో వైపు తెగుళ్ల దాడితో రైతులు నష్టపోతున్నారు. ఈ దశలో తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జించే పద్ధతులపై రైతులు దష్టిసారిస్తున్నారు. అందులో భాగంగానే వెదజల్లు సాగును అనుసరిస్తున్నారు. ఈ విధానంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే అవకాశముందని రైతులే చెబుతున్నారు. గన్నవరం మండలంలో 17 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగును నిర్దేశించారు. ఇందులో 7 వేల ఎకరాల్లోవెదజల్లు సాగును నిర్దేశించారు. భక్త గ్రామాల్లో ఎక్కువగా వెదజల్లుతున్నారు. రైతులు గతంలో ఈ విధానంపై అనాసక్తత చూపినప్పటికీ ప్రస్తుత సీజన్లో మాత్రం మొగ్గు చూపుతున్నారు. ఇప్పటి వరకు 4 వేల ఎకరాలకుపైగా వెదజల్లు సాగు చేపట్టారు. ఖరీఫ్ సీజన్లో వర్షాలు, వరదలు, తుపానులు వంటి విపత్తులు సంభవిస్తాయి. అయితే కాలువలు పూడికలతో నిండి ఉన్నందున నీరు సకాలంలో శివారు భూములకు చేరలేదు. దీంతో నిర్దేశిత సమయానికి నారు మడులు వేయలేకపోయారు. ఈ నేపథ్యంలో వెద విధానంపై ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ అధికారులు కూడా ప్రోత్సహిస్తున్నారు. వెదజల్లు విధానంలో సాగునీటి వినియోగం తక్కువ ఉంటుంది. కూలీల సంఖ్య అంతగా ఉండదని చెబుతున్నారు. సాధారణ పద్ధతుల్లో మడుల తయారీ, విత్తనాలు చల్లటం, మందుల పిచికారీ, నారు తీయటం, నాట్లు వేయటం వంటి ప్రక్రియలకు పెట్టుబడి ఎక్కువ అవుతుంది. ఈ పద్ధతిలో ఖర్చులు



వెద సాగుచేసిన చేను

గణనీయంగా తగ్గుతాయని రైతులు తెలిపారు. విత్తనాల ఖర్చు 10శాతం నుంచి 15 శాతం వరకు తగ్గుతుంది. పెట్టుబడి రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు ఆదా అవుతుంది. పంట 15 రోజుల ముందుగానే కోతకు వస్తుంది. దీంతో విపత్తుల నుంచి రక్షణ పొందొచ్చు. దిగుబడి 10 నుంచి 16 శాతం పెరుగుతుంది. అయితే ఈ విధానంలో కలుపు ఎక్కువగా ఉంటుంది. దీనిపై రైతులు దష్టి పెట్టాల్సిన అవసరం ఉందంటున్నారు.

రైతుల్లో చైతన్యం వచ్చింది : శివ ప్రసాద్, ఎఒ

వెదజల్లు విధానంలో సమయం, ఖర్చులు ఆదా అయి రైతుకు మేలు జరుగుతుంది. దీనిపై ఎప్పటి నుంచో ప్రచారం చేస్తున్నాం. ఇప్పటికి రైతుల్లో చైతన్యం వచ్చింది. ఇది అన్ని రకాలుగా వారికి మేలు చేకూరుస్తుంది.

ఆటో కార్మికులకు జీవనభృతి కల్పించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : ఆటో కార్మికులకు జీవన భృతి కల్పించాలని, రవాణా రంగంలో ప్రమాదకరమైన జీవో 21 రద్దు చేయాలని కష్ణాజిల్లా ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి మద్రాపు పోలి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం సిఐటియు మండల కో కన్వీనర్ సిహెచ్ గంగాభవాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయటం శుభ పరిణామం అన్నారు. అయితే ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల జిల్లాలో 20వేల మంది ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయి, రోడ్డును పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామా, పట్టణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదివి ఉద్యోగము లేక ఆటో రంగాన్ని నమ్ముకుని ఉపాధి పొందుతున్న కార్మికుల కుటుంబలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆస్తులను తాకట్టు పెట్టి ప్రైవేటు ఫైనాన్స్ వ్యాపారుల నుండి రుణాలు చేసి ఆటో కొనుగోలు చేసుకుని ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికుల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. ఉపాధి కోల్పోయే ఆటో కార్మికులకు జీవన భతి కింద నెలకు 25 వేల రూపాయలు



సహాయం అందించాలని, ఆటో,రవాణా రంగ కార్మికులకు ప్రమాదకరమైన జీవో నెంబర్ 21ని రద్దు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 19వ తేదీన మచిలీపట్నంలో జరిగే కష్ణాజిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ మరియు ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ మహాసభను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల సిఐటియు కన్వీనర్ మహమ్మద్ కరీముల్లా, ఆటో వర్కర్స్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం పెద్ద ఎత్తున జరిగాయి. కేసరపల్లి గ్రామంలోని కృష్ణా ఆలయంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్ధసారథి హాజరై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు, వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగ రాజకుమారి, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ :** పెడన పట్టణంలోని స్థానిక మఠం వీధి కళాంజలి హై



గన్నవరం మండలం కేసరపల్లిలో పాల్గొన్న మంత్రి పార్థసారథి

స్కూల్‌లో ఎల్కేజీ, యూకేజీ చిన్నారులు శ్రీకష్ణుని వేషధారణలో సందడి చేశారు. అనంతరం చిన్నారులకు ప్రిన్సిపల్ కె .దిలీప్ కుమార్, కరస్పాండెంట్ కె.ప్రసన్న లక్ష్మీ లు బహుమతులు అందజేశారు. అలాగే మచిలీపట్నం కోనేరు సెంటర్, జవ్వార్ పేటలోని యాదవ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, యాదవ సంఘం నేతలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** కూచిపూడి గ్రామంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళా పీఠం, కూచిపూడిలో శనివారం శ్రీ వేడుకలు నిర్వహించారు. పెను మూడి సతీష్ కుమార్, కళా పీఠం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చింతా రవి బాల కష్ణ ,పసుమర్తి హరినాధ శాస్త్రి, ఏలేస్వరపు వెంకటేశ్వర పణి కుమార్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి గుడ్లవల్లేరు :** మండలం లోని కవుతరంలోని చెన్నకేశవ స్వామివారి ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీ కష్ణుని వేషధా రణలో చిన్నారులు ఉట్టి కొట్టే ప్రక్రియ అందర్నీ ఆకట్టు కుంది. పెనుమూడి లక్ష్మణ్, పాగోలు సాయి, కానూరి సత్యనారాయణ ప్రసాద్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పామర్రు :** నిమ్మకూరులోని ఏపీఆర్జేసీ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు వేసిన సాంస్కతిక కార్యక్రమాలు, వేసిన వేషధారణలు అందరిని అలరించాయి. పామర్రు ఏఎన్ఎం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాలలో ఉన్న శ్రీకష్ణ ద్వారాకాలయం వద్ద వేడుకలు ఆలయ కమిటీ సభ్యులు, యాదవ యూత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. శ్రీ కృష్ణ ద్వారకాలయం కమిటీ సభ్యులు, యాదవ యూత్, మహిళలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ :** స్థానిక ఏలూరు రోడ్డులోని కృష్ణమందిరంలో నుండి పట్టణంలోని ప్రధాన రాహదారులలో కృష్ణుడి పోటోలతో వాహనలపై భారీ ఊరింగింపు నిర్వహించారు. మాజీ మంత్రి కఠారి ఈశ్వరకుమార్, వైసీపీ పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, వైసిపి జిల్లా నాయకులు మేరుగుమాల కాళీ, యాదవ సంఘం నాయకులు డొక్కు రామచంద్రరావు(రాంబాబు) పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి పడమర వీధిలో యాదవ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పోతురాజు గుడి వద్ద శ్రీకష్ణ విగ్రహానికి మహిళలు పూజలు చేశారు. కొల్లు రామ కోటేశ్వరరావు, గొరిపర్తి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

మొక్కలు అందజేత

ప్రజాశక్తి-ఉయ్యూరు : పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు ప్రతిఒక్కరు మొక్కలునాటి సంరక్షించడం ఉద్యమంలా చేపట్టాలని పెదఓగిరాల పీఏసీఎస్ అధ్యక్షుడు మున్నంగి శ్రీనివాస రెడ్డి అన్నారు. కేడీసీసీ బ్యాంకు అందచేసిన వివిధ రకాల 4వేల మొక్కలలో కొన్నింటిని సొసైటీ ఆవరణలో నాటి మిగిలిన సొసైటీలకు, గ్రామస్తులకు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్కుమార్, సొసైటీ డైరెక్టర్ సాంబశివరావు, పార్టీ నాయకులు ప్ర సాదరెడ్డి, వడ్డేసాయి శోభన్, పోతిరెడ్డి, సుభాని, కళ్యాణ్, వేగుగోపాలరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.



పాఠశాలకు టివి బహూకరణ

ప్రజాశక్తి-ఘంటసాల : విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని సర్పంచ్ వెనిగళ్ల రామకష్ణ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండల పరిధిలోని వి.రుద్రవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థులైన తూము దిలీప్ పుస్తకాల ర్యాక్ ను, డాక్టర్ తూము ధీరజ్ ఎల్ఈడి టివిని గ్రామసర్పంచ్ చేతుల మీదుగా పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థితికి ఎదిగిన పూర్వ విద్యార్థులు దిలీప్, ధీరజ్ పాఠశాలకు రూ. 32 వేలు విలువ చేసే ర్యాక్, ఎల్ఈడి టివిని బహుకరించటం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో మొవ్వ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు తూము అంబేద్కర్, దాసు, ప్రధానోపాధ్యాయురాలు దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి లయన్స్ క్లబ్ నగర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర పరీక్ష శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ వెంకట రోగులను పరీక్షించి పలువురికి ఐ ఓ ఎల్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి గూడూరులోని నేత్రాలయంలో



ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించనున్నారు. శిబిరాన్ని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముమ్మనేని రాజకుమార్(నాని), వరద హరగోపాల్, కోశాధికారి నరా సాయిబాబు అంబటి శంకర్రావులు పర్యవేక్షించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి- గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరు సొంత రోడ్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు దాతలు రూ.1.25లక్షల విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందించారు. స్థానిక ఎస్ఈఆర్ఎమ్ హైస్కూల్లో టెన్త్ బ్యాచ్(1991-92) పూర్వ విద్యార్థులు ఈ విరాళాన్ని అందించినట్లు వెంకట్రావు పేర్కొన్నారు.



ముందు చూపేదీ?

పెళ్లిళ్ల, పండుగలు సీజన్‌లోనూ, ప్రయాణీకులకు ఆర్టీసీ బస్సు దొరకడమే గగనంగా మారుతోంది. ప్రయాణీకులకు ప్రయివేటు వాహనాలే దిక్కవుతున్నాయి. ఆర్టీసీ పాస్‌లు తీసుకున్న విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి రద్దీగా ఉండే బస్సుల్లో సీట్లు దొరక్క నిలబడే ప్రయాణించాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో ఈ సమస్యలు పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని(స్త్రీ శక్తి) ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది.

కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ, ఉయ్యూరు, గన్నవరం ఆర్టీసీ డిపోల పరిధిలో 163 రూట్లలో 411 బస్సుల్లో 78,953 మంది ప్రయాణీకులను రోజువారీ గమ్యస్థానాలకు చేర్చుతున్నాయి. 19,323 మంది మహిళలు, 59,165 మంది పురుషులు, 465 మంది ఇతరులు ప్రయాణిస్తున్నారు. ప్రయాణీకులు ఆక్యుఫెన్సీ రేషియో 68 శాతం ఉంటోంది. ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డనరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ తదితర 309 బస్సుల్లో మహిళల గుర్తింపు కార్డులు (ఆధార్, రేషన్ కార్డులు, ఓటరు ఐడి, డ్రైవింగ్ లైసెన్స్) తదితరాలను పరిశీలించి ఉచిత ప్రయాణానికి అనుమతిస్తున్నారు. మొత్తం ప్రయాణీకుల్లో 24.48 శాతం మాత్రమే మహిళలున్నారు. ఉచిత బస్సు అందుబాటులోకి రావడంతో మహిళ ప్రయాణీకులు సంఖ్య 50 శాతానికి

వీక్షణం

పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ముందుచూపుతో సమస్యలు పరిష్కరించకుండానే స్త్రీ శక్తిని తీసుకురావడం ప్రయాణీకులను మరిన్ని కష్టాలకు గురిచేస్తుందనే ఆరోపణలు వినవస్తున్నాయి. పెరిగే ప్రయాణీకుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు, సిబ్బందిని పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఆందోళనలో ఆటోవాలా !

ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు అనేక మంది ఆటోలు నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం నగరపాలక సంస్థ, పెడన, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప మున్సిపాల్టీలు, 25 మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లోని 77 స్టాండ్‌ల్లో 19, 736 ప్యాసెంజర్ ఆటోలున్నాయి. ఇంధన ఖర్చులు పోను సగటున రూ. 500 నుంచి రూ. 700 ఆదాయం పొంది ఆటోవాలాలు కుటుంబాలను పోషించుకుంటున్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం రోజువారీ ఆటో సర్వీసులపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు. స్త్రీ శక్తిని స్వాగతిస్తూనే యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని మరింతగా పెంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వాహన మిత్రను ఏడాదికి రూ. 10 వేల నుంచి రూ. 15 వేలకు పెంచి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారని, స్త్రీ శక్తితో తాము కోల్పుతున్న ఆదాయాన్ని భర్తీ చేయడానికి ఏడాదికి రూ. 25 వేలు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం తమ సమస్య తక్షణమే పరిష్కరించకుంటే ఆటోలు ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేక, కుటుంబ పోషణ భారమై వీధిన పడుతామని వాపోతున్నారు. స్త్రీ శక్తిని ప్రారంభించిన ప్రభుత్వం ఆటో వాలాలకు ఇచ్చిన హామీని పెంచి తక్షణమే అమలు చేయాల్సి ఉంది.

-డి. రాంబాబు

కెమెరాలపై ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా, కెమేరాలు, యాక్ససరీస్‌పై ఉత్తేజభరితమైన ఆఫర్లను అందిస్తుందని అమెజాన్ రీజినల్ ఇన్‌ఛార్జ్ కె.రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిఎస్‌ఎల్‌ఆర్‌లు ఆధునికమైన మిర్రర్ లెస్ కెమేరాల నుండి లెన్స్‌లు అవసరమైన యాక్ససరీస్ వరకు అభిరుచి కలిగిన ఔత్సాహికులు సోనీ, కానన్, ఇన్ స్టా 360 వంటి ప్రముఖ బ్రాండ్స్‌లో ఆఫర్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు ప్రత్యేకమైన ఆఫర్లు అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు నగరంలోని అమెజాన్ స్టోర్ నందు సంప్రదించవచ్చని తెలిపారు.



నిరసన తెలుపుతున్న ఆటో, క్యాబ్ కార్మికులు

ఆటో, క్యాబ్ కార్మికులకు న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ

మహిళలకు ఉచిత బస్సు ప్రారంభం రోజు ఆటో, క్యాబ్ డ్రైవర్లకు కూడా ఆర్థిక సహాయం ప్రకటిస్తానని చెప్పి మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలను నిరసిస్తూ శనివారం విజయవాడ రైల్వే స్టేషన్ మెయిన్ గేటు వద్ద విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు మాట్లాడుతూ ఆటో క్యాబ్ డ్రైవర్లను టిడిపి కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని, శ్రీ శక్తి పథకం ప్రారంభం రోజే ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆర్థిక సహాయం ప్రకటిస్తానని చెప్పి ఎటువంటి ప్రకటన చేయకపోవడం సరికాదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.15 వేలు ఆర్థిక సహాయం, ఆటో మోటార్ కార్మికులకు వేల రూపాయలు జరిమానాలు విధించే జీవో నెంబర్ 21 రద్దు చేస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఒక్కటి అమలు చేయలేదని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు పథకం వలన ఆటో, క్యాబ్ డ్రైవర్లు నష్టపోతారని తెలిపారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు బ్యాడ్జితో సంబంధం లేకుండా ఏడాదికి రూ.25 వేలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.సుబ్బరాజు, డి.కాళేశ్వరరావు, వై.అప్పలరాజు, వై.దుర్గారావు బి.కుమార్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ



79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాష్ట్ర కార్యాలయంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో నాటు సారాను పూర్తిగా రూపుమాపటానికి అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటి వరకు 15 జిల్లాల్లో నాటు సారాను పూర్తిగా రూపుమాపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్ దేవ్ శర్మ, జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు మధుమేహ రోగులకు ప్రత్యేక వైద్యశిబిరం

ప్రజాశక్తి - తిరువూరు

జనవిజ్ఞానవేదిక (జెవివి) ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరులోని నాగార్జున హైస్కూల్‌లో మధుమేహ రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జెవివి ప్రతినిధులు పాపారావు, హరికష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహిస్తామని, మధుమేహం, రక్తపోటు, మూర్ఛరోగులకు ఈ శిబిరంలో వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తారని తెలిపారు. మూడు రోజుల క్రితం షుగర్ పరీక్షలు చేయించుకున్న రిపోర్టులు తప్పనిసరిగా తీసుకొని రావాలని సూచించారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ 38వ డివిజన్‌లోని మల్లికార్జునపేట వాటర్ ట్యాంక్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ఫ్లోర్ లీడర్ పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు మాట్లాడుతూ ప్రజలపై పన్నుల భారాలు పెంచడంలో చూపిన శ్రద్ధ మంచినీరు అందించడంలో చూపించాలని కోరారు. కృష్ణానది పక్కన ఉన్న ప్రజలకు కూడా మంచినీరు అందించడంలో పాలకులు వైఫల్యం చెందారని అన్నారు. మంచినీటి సరఫరా సక్రమంగా కాకపోవడంతో పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మురుగునీరు, బురద నీరు, రంగు మారినీరుతో ప్రజలు రోగాల బారినపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పైప్ లైన్ లీకేజీ సమస్యలను గాలికి వదిలేస్తున్నాని తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు తెలియపరిచినా ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరసన తెలిపాల్సి వచ్చిందని తెలిపారు. పాలకులు స్పందించి నాణ్యమైన మంచినీటి సమస్యను పరిష్కరించాలని, పైప్ లైన్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రీవెన్స్‌లో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం వాటర్ సప్లై డిఈ పురుషోత్తంకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అభివద్ధి కమిటీ నాయకులు శ్రీనివాస్, సిఐటియు నాయకులు వి సాంబశివరావు, మహిళ కమిటీ నాయకులు కె జ్యోతి, జి భవాని, జె ఝాన్సీ, టి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

విలువలతో కూడిన విద్య అవసరం

- శారదా విద్యా సంస్థల ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

విద్యార్థి దశలో కొన్నిటికి త్యాగాలు చేసి చదువుపైనే పూర్తి సమయాన్ని కేటాయిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరడం సాధ్యమవుతుందని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ సూచించారు. ప్రస్తుతం ఉన్న సమాజంలో విద్యార్థులు అనేక సందర్భాల్లో సమయాన్ని వృధా చేస్తున్నారని, దీనివల్ల అనుకున్న లక్ష్యాన్ని సాధించడం కష్ట సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా, సెల్ ఫోన్లు వంటి వాటికి కొంతమేర దూరంగా ఉండి విద్యపై దష్టి సారించిన వారికి అనుకున్న లక్ష్యాన్ని సాధించడం ఏమాత్రం అసాధ్యం కాదని ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని శారద విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ శనివారం ఏ ప్లస్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి శారద విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోన శశిధర్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో పిల్లలకు కావలసిన సత్ప్రవర్తన, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, స్నేహం, గౌరవ మర్యాదలు, సహాయ సహకారాలు, సేవా దక్పథం, లక్ష్యసాధన, సమాజంలో వారు ఎటువంటి స్థానంలో ఉండాలి, సమాజం, కుటుంబం పట్ల కలిగి ఉండే బాధ్యతలను, మానవతా విలువలను నేర్పించే కేంద్రాలు కేవలం విద్యాసంస్థలే అని ఆయన వివరించారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీని మంచి చెడులను దష్టిలో పెట్టుకొని వినియోగించుకోవాలని, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు దుర్వినియోగం చేసుకోకూడదని ఆయన సూచించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ వెల్లంకి శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న విద్యా వనరులను ఉపయోగించుకొని బంగారు భవిష్యత్తుకు మంచి ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ వై రమేష్ బాబు మాట్లాడుతూ గడిచిన పదకొండు సంవత్సరాల నుండి కేవలం డేస్ కాలర్స్ విద్యాసంస్థగానే తమ విద్యార్థుల నుండి అత్యుత్తమ ఫలితాలను సాధించి మంచి మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు సంపాదిస్తూ ముందుకెళుతున్నామని వివరించారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై శారదా దేవి మాట్లాడుతూ 11 వసంతాలు కాలంలో తాము ఎంతో మంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించమని పేర్కొన్నారు. కళాశాల అడ్వైజర్ ఈ ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులను కేవలం సదువుల విషయంలోనే కాకుండా వారికి ఆసక్తి కలిగిన క్రీడా రంగాలకు కూడా ప్రాధాన్యమిస్తూ ప్రతి సంవత్సరం స్పోర్ట్స్ మీట్ ను నిర్వహిస్తున్నామని, సాంస్కృతిక రంగాలలో కూడా వారికి పాల్గొనే అవకాశం కల్పించడం కోసం ఫ్రెషర్స్ డే నిర్వహిస్తున్నామని అన్నారు. కళాశాల జీఎం జివి రావు మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన జేఈఈ మెయిన్స్, నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు, వారు పొందిన మెడికల్ అండ్ ఇంజనీరింగ్ సీట్లతమ కళాశాల స్థాయిని నిరూపిస్తాయని తెలిపారు.



వేడుకలను ప్రారంభిస్తున్న కోన శశిధర్